

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 15.04.2026 | సంపుటి: 3 | సంచిక: 74 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 15.04.2026 | VOLUME : 3 | ISSUE : 74 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## 850 లోక్‌సభ స్థానాలు



- డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

4



# డీలిమిటేషన్‌పై విస్తృత చర్చ జరగాలి

- నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీ కుట్రలు
- అంబేడ్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా అడుగులు
- డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, ఏప్రిల్ 14(రాజముద్ర న్యూస్): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్కతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని సీఎం ఆరోపించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా

మిగతా 2వ పేజీలో..

# నిప్పులు కుమ్మరించినట్టు

## రాష్ట్రంలో మండుతున్న ఎండలు



- ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు
- రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

## అంబేడ్కర్‌ను బందీని

# చేసిన కాంగ్రెస్



- తాము హెచ్చరించాకనే తాళాలు తీశారు
- గురుకులాల్లో మరణ మ దంగం
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో మోసం
- కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం
- శ్రేణులకు బీఆర్ఎస్ నేత కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 14:** ప్రపంచంలోనే అతిపెద్దదైన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఆవిష్కరించారన్న దుర్బుద్ధితో కాంగ్రెస్ పార్టీ 2024 ఏప్రిల్ 14 నాడు బందీ చేసిందని, 125 అడుగుల ఎత్తులో ఆ మహానుభావుణ్ణి సంకెళ్లలో పెట్టి ఎవరినీ దర్శిం చుకోనీయకుండా చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 2025లో

మిగతా 2వ పేజీలో..

## ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- ప్రధాని మోదీ
- ఢిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

4



## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోపిడీనే

- కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
- కేటీఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
- కాంగ్రెస్ కమిటీ బాధ్యతల స్వీకారంలో పీసీసీ చీఫ్



3

# అంబేడ్కర్ అందరి వాడు

- ఓ వర్గానికి ఆపాదించుకునే కుట్ర జరుగుతోంది
- తడకపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో హరీష్‌రావు

**సిద్దిపేట, ఏప్రిల్ 14 :** సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నో ఎళ్లుగా ఉన్న లోటు నేటితో తీరిపోయిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

మిగతా 2వ పేజీలో..





## సమ్మె యోచన విరమించండి

- చర్చలకు మా తలుపులు తెరిచే ఉన్నాయి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

**హైదరాబాద్, ఏప్రిల్ 14:** ఆర్టీసీ పరిరక్షణ - ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళ వారం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించు కుందామని కార్మికులకు పిలుపునిచ్చారు. సమస్యలు

మిగతా 2వ పేజీలో..

## ఇంకా అజ్ఞాతంలో నలుగురు

# మావోయిస్టులు

- గణపతి, సంతోష్, రత్నాబాయి, వార్త శేఖర్
- తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి

## రాష్ట్రంలో మావోయిస్టుల

# ప్రభావం లేదు

- వివిపీల సెక్యూరిటీ విడతల వారీగా తగ్గిస్తాం: డీజీపీ శివధర్‌రెడ్డి



3

# ప్రతిపక్షంలో హామీ

## అధికారంలోకి వచ్చాక నిధుల లేమి

### ప్రభుత్వ ద్వంద్వ విధానంపై పెరుగుతున్న అసంతృప్తి

- విద్యుత్ శాఖలో దీర్ఘకాల సమ్మెతో ఉద్రిక్త పరిస్థితి
- ఆర్టీసీ విలీనం డిమాండ్‌పై కార్మికుల పోరాటం
- కార్మిక సంఘాలతో చర్చలకు ముందుకు రాని ప్రభుత్వం
- ఫిరాయించిన ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి
- కలకలం సృష్టించిన ప్రభుత్వ సలహాదారుడి వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భారీ హామీలు ఇచ్చి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయడంలో విఫలమవుతోందా అనే ప్రశ్నలు తెలంగాణలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. అప్పట్లో సమస్యలను ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేసిన నాయకత్వం, ఇప్పుడు అదే సమస్యలపై మౌనం వహించడం కార్మికులు, ఉద్యోగులు, ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది.అటు ఉద్యోగుల పరిస్థితి ఇలా ఉంటె ఇటు అబివృద్ధి పేరిట పక్క పార్టీలనుండి చేర్చుకున్న ఎమ్మెల్యేల అసంతృప్తి ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..

# జీవన్‌రెడ్డికి మర్యాద తగ్గించలేదు

- పరిస్థితులను పంచుకునేందుకే మీతో సమావేశం
- జగిత్యాల ముఖ్య నేతలతో రేవంత్ భేటీ
- మేమంతా కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం
- స్పష్టం చేసిన నాయకులు

3






# అంబేడ్కర్ అందరి వాడు

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సాయి, ఆయన కుమారుడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు వారిని అభినందిస్తున్నానంటూ గ్రామం మొదట్లోనే విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఎవరు గ్రామానికి వచ్చినా మొదట ఆహ్వానం పలికేది అంబేడ్కరేనని, ఆయన జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమని అన్నారు. కొంతమంది అనుకున్నట్లు అంబేడ్కర్ ఒక వర్గానికి మాత్రమే నాయకుడు కాదని, ఆయన అందరివాడని, కొంతమంది కావాలనే ఒక వర్గానికి ఆపాదించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఇవాళ భారత దేశం ప్రపంచంలో అదిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదుగుతునదంటే అది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అమెరికా వంటి దేశంలోనే మహిళలకు ఓటు హక్కు రావాలంటే దశాబ్దాల కాలం పట్టింది.. కానీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని హరీష్‌రావు తెలిపారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం చదువుకు అడ్డు కాదని అంబేడ్కర్‌ని చూసి నేర్చుకోవాలన్నారు. దేశంలోని అణగారిన వర్గాల కోసం పోరాడి విజయం సాధించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి ఆశయాలను రాష్ట్రంలో ముందుకు తీసుకుపోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కి నేడు ఏమీ చేయలేక చేతులు ముడుచుకుని కూర్చుందని విమర్శించారు. 10వ తరగతి పాస్ అయితే రూ.10 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ.25 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.లక్ష, పీజీ పాస్ అయితే రూ.2 లక్షలు ఇస్తామని ఎన్నికలపుడు కాంగ్రెస్ నాయకులు చెప్పి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ రెండున్నరేళ్లల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఆనాడు కేసీఆర్ ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు ఇచ్చి విదేశాల్లో చదివించారన్నారు. దేశంలో 28 రాష్ట్రాలు ఉంటే సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఇది కేసీఆర్ పెట్టించిండు అని రేవంత్ రెడ్డి అక్కడ గేట్లకు తాళం వేయించాడని, కనీసం అంబేడ్కర్ కు దండ కూడా వేయని సంకుచిత మనస్తత్వం ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు అమలు చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.



## ఇంకా అజ్ఞాతంలో నలుగురు మావోయిస్టులు

- **గణపతి, సంతోష్, రత్నాబాయి, వార్త శేఖర్**
- **తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14:**

తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది. సాయుధ పోరాటం విరమించి జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలని మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. మరోవైపు కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎలఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. ఆమెపై రూ.5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఆమె మృతదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## సమ్మె యోచన విరమించండి

మొదటిపేజీ తరువాయి

చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని కార్మికులకు సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పనిచేస్తున్నదని ఈ సందర్భంగా మంత్రి పొన్నం గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపివేస్తామని స్పష్టం చేసింది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సోమవారం సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని తెలిపారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని యాజమాన్యం స్పష్టం చేసిందన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పైవిధంగా స్పందించారు.



# అంబేడ్కర్‌ను బందీని చేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి



కూడా అదే అక్కసుతో మళ్ళీ బంధించి అవమానించిందన్నారు. అందుకే మొన్న విద్యార్థి విభాగం నాయకత్వంలో ఒక నిర్ణయం తీసుకున్నామని, ఒకవేళ ఈసారి కూడా బాబాసాహెబ్‌ను మళ్ళీ బందీ చేస్తే తామే వందలాదిగా వేలాదిగా వచ్చి ఆ సంకెళ్లు బద్దలు కొడతామని చేసిన హెచ్చరిక ఇవాళ ఫలించి రాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఏర్పాట్లు చేసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం తెలంగాణ భవన్ నుండి భారీ కాన్వాయ్‌తో కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయాలను స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అంబేడ్కర్ మాటల స్ఫూర్తితో కేసీఆర్ లక్షలమందితో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడి చివరకు చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ని రాజకీయ అవసరాల కోసం వాడుకుందే తప్ప గౌరవించలేదని ఆయన విమర్శించారు. 1952, 1954లో ఆయన పార్లమెంటుకు రాకుండా కుట్రలు చేసి ఓడించిందన్నారు. హిందూ కోడ్ బిల్లు విషయంలో మహిళలకు హక్కులు కల్పించాలని ఆయన చూస్తే దాన్ని అడ్డుకున్నందుకు నిరసనగా ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ కాలంలో ఆయనకు భారతరత్న ఇవ్వలేదని, కాంగ్రెసేతర ప్రభుత్వం వచ్చినప్పుడే ఆయనకు ఆ గౌరవం దక్కిందని అన్నారు.. చివరకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఆయన ఫోటో పెట్టడానికి కూడా కాంగ్రెస్ ఒప్పుకోలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వెయ్యి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి దాదాపు 6.5 లక్షల మంది పిల్లలకు, ఏడాదికి ఒక్కొక్కరిపై రూ.1.25 లక్షల చొప్పున ఖర్చు చేస్తూ ప్రపంచంతో పోటీపడే పౌరులుగా తయారు చేయాలని సంకల్పించిందన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని సరిగా నిర్వహించలేకపోతోందని, గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ వల్ల, ఆత్మహత్యల వల్ల 130 మందికి పైగా విద్యార్థులు మరణించడం దౌర్భాగ్యమన్నారు. కేసీఆర్ దళిత బంధు కింద రూ.10 లక్షల ఇస్తే తాము రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఆ స్కీమ్‌కు 'అంబేద్కర్ అభయహస్తం' అని పేరు పెట్టారు కానీ దాన్ని అమలు చేయకుండా దళితులను, అంబేడ్కర్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. నాడు కేసీఆర్ కంటే మించిన పథకం తెస్తామని 'అంబేద్కర్ అభయహస్తం' అని చెప్పి చేవెళ్ళలో మల్లికార్జున ఖర్గేని పిలిచి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఆ మూడు వర్గాలకు 'అభయ హస్తం' పేరిట మేనిఫెస్టోలో 72 శాతం ప్రభుత్వ కాంట్రాక్టులు ఇస్తామని చెప్పిందని, రెండున్నరేళ్ల పాలనలో రూ.లక్ష, లక్షన్నర కోట్ల కాంట్రాక్టులు రేవంత్ రెడ్డి పిలిచిండు అని, 72 శాతం వాటా ఇవ్వలేదని, రేపోమాపో మూసీ కాంట్రాక్టు పిలుస్తారట.. మరి ఆ కాంట్రాక్టులు ఇస్తాడా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కూడా పెంచుతా అన్న రేవంత్ రెడ్డి ఇవ్వాళ రూపాయి ఇవ్వడంలేదన్నారు.వాళ్ల విద్య మధ్యలోనే ఆగిపోయేలా అన్యాయం చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ప్రతి గిరిజన తండాకు, ప్రతి దళిత వాడకు తెలిసేలా చేయాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ఏప్రిల్ 27 నాడు మన పార్టీ ఆవిర్భావ దినోత్సవం, జగిత్యాలలో బహిరంగ సభ రెండు కార్యక్రమాల తర్వాత మే, జూన్‌ల్లో ఎస్సీ, ఎస్టీల కోసం సభలు పెడదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేసిన హామీల మీద మనం పకడ్బందీగా పోరాడాలన్నారు. చేవెళ్ళ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో పాటు బీసీ, రైతు డిక్లరేషన్లను అమలు చేసే వరకు అంబేడ్కర్ స్ఫూర్తితో తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. నివాళులు అర్పించిన అనంతరం కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు విగ్రహం కింది భాగంలో ఉన్న భవనంలోని మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జీవిత విశేషాలను, చారిత్రక ఘట్టాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిపక్షంలో "హామీ " అధికారంలోకి వచ్చాక నిధుల "లేమి"

మొదటిపేజీ తరువాయి

వైఫల్యానికి అద్దంపడుతోంది .ఇప్పటికే టీఆర్ఎస్ నుండి వచ్చిన ఒక ఎమ్మెల్యే అదే పార్టీలోకి తిరిగివెళ్ళారు.మరికొందరు అదే బాటలో వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.దీనికి కారణం సైతం చేరెప్పుడు వారికిచ్చిన హామీలను నెరవేర్చక పోవడమే .అదేదో సామెత చెప్పినట్టు ఒడ్డు చేరేవరకు ఓడమల్లన్న అని ఒడ్డు చేరాక బోడమల్లన్న అన్నట్టుంది ప్రభుత్వ వ్యవహారం.




**విద్యుత్ శాఖలో సమ్మె.. పరిష్కారం ఎక్కడ?**

విద్యుత్ శాఖలో ఆర్టిసియన్లు తమ డిమాండ్ల సాధన కోసం దీర్ఘకాలంగా నిరసనలు చేపట్టిన తర్వాత సమ్మెకు దిగారు. క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నాయకత్వం, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా చర్యలు తీసుకోకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమ్మె ప్రారంభమైన తర్వాత కూడా ప్రభుత్వం చర్చలకు ముందుకు రాకపోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోంది.

**ఆర్టీసీ కార్మికుల హెచ్చరిక.. విలీనం ఎప్పుడూ?**

ఆర్టీసీ కార్మికుల సమస్య కూడా ఇదే విధంగా కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించలేదు. నెలరోజులుగా కార్మిక సంఘాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీస్ ఇచ్చాయి. ఈ నెల 22 నుండి సమ్మెకు వెళ్తామని ప్రకటించడం రాష్ట్రంలో రవాణా వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**సమస్యల పరిష్కారంలో విఫలం**

కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చురుకుదనం చూపకపోవడం ప్రధాన విమర్శగా మారింది. విద్యుత్ శాఖ, ఆర్టీసీ వంటి కీలక విభాగాల్లో కార్మికులతో నేరుగా చర్చలు జరపకపోవడం వల్లే సమస్యలు తీవ్రతరమవుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. అల్టిమేటంలు జారీ చేయడం తప్ప, సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఫిరాయించిన నేతల నిరసనలు**

అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ బలం పెంచుకునే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షిస్తూ, అభివృద్ధి హామీలతో కాంగ్రెస్ కండువా కప్పించగలిగింది. నియోజకవర్గాల్లో అభివృద్ధి బాధ్యతలు వారికే ఉంటాయని భరోసా ఇచ్చినా, పార్టీలో చేరిన తర్వాత పరిస్థితి భిన్నంగా మారింది. స్థానికంగా పోటీ చేసి ఓడిన నేతలతో వర్గపోరు తీవ్రరూపం దాల్చగా, చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హామీలు ఇచ్చి పార్టీలోకి చేర్చుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి లేదా మంత్రులను కలిసే అవకాశం కూడా దొరకడం లేదని కొందరు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల మధ్య పటాన్‌చెర్వు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో చేరడం అధికార పార్టీకి పెద్ద షాక్‌గా మారింది. తిరిగి టీఆర్ఎస్ లో వెళ్లడమే కాకుండా అదే సమయంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం టిఆర్ఎస్ పార్టీ చైర్మన్లను గెలిపించుకున్నారు .ఇది పరోక్షంగా తన బలమేంటో ప్రభుత్వానికి చెప్పకనే చెప్పారు .ఇదే సమయంలో ప్రభుత్వ సలహాదారు, బాన్స్‌వాడ ఎమ్మెల్యే సీనియర్ రాజకీయ నాయకుడు,మాజీ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత కలకలం రేపాయి. ప్రభుత్వం కొనసాగుతుందా అనే సందేహం వ్యక్తం చేస్తూ, గతంలో ఫోన్ చేస్తే నిధులు మంజూరు చేసేవారని, ఇప్పుడు ఫోన్‌లకే స్పందన లేదని విమర్శించడం గమనార్హం. ముఖ్యమంత్రికి పలుమార్లు చెప్పినా పనులు జరగడం లేదని, ప్రజల కోసం పని చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించడం ప్రభుత్వంపై పెరుగుతున్న అంతర్గత అసంతృప్తికి నిదర్శనంగా భావించబడుతోంది.


**వర్గపోరు..తిరిగి మారుతున్న నేతలు**

పార్టీ మారిన ఎమ్మెల్యేలు స్థానికంగా వర్గపోరును ఎదుర్కొంటున్నారు. కొందరికి తప్ప మిగిలినవారంతా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో కొందరు తిరిగి తమ పాత పార్టీల వైపు మొగ్గు చూపడం గమనార్హం. ఇది అధికార పార్టీకి రాజకీయంగా ప్రతికూల సంకేతాలుగా మారుతోంది. ఇటీవల ప్రభుత్వ సలహాదారుడే ప్రభుత్వం కొనసాగుతుందా అనే సందేహం వ్యక్తం చేయడం రాజకీయంగా కలకలం రేపింది. తన పనులు కూడా జరగడం లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కష్టమైందని వ్యాఖ్యానించడం పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది ప్రభుత్వంపై అంతర్గత అసంతృప్తి ఎంత స్థాయిలో ఉందో చూపిస్తోంది.

**అభివృద్ధి పనులకు ఆటంకం..**

ఇక అభివృద్ధి పనుల విషయంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నిధుల కొరత, చెల్లింపుల ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు కొనసాగించలేకపోతున్నారు. ఇప్పటికే చేపట్టిన పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అభివృద్ధి ప్రాజెక్టులు మందగిస్తున్నాయి. ఒకవైపు అమలు కాని హామీలు, మరోవైపు పెరుగుతున్న సమ్మెలు, రాజకీయ అసంతృప్తి ఇవి అన్నీ కలిసి తెలంగాణలో పరిపాలనపై అనిశ్చితి వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.





# అంబేడ్కర్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకం

మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు.

గత పదేళ్ల పాలన కారణంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని, గతంలో తీసుకున్న అప్పులను చెల్లిస్తూ తప్పులను సరిదిద్దుకుంటూ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో దళితులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని వివరించారు.

సమాన అవకాశాల ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ చూపిన మార్గాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని సీఎం పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్ మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు ఇప్పుడు సీట్ల సంఖ్య తగ్గించే పరిస్థితి తీసుకురావడం తగదని సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయంగా అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



# నిప్పులు కుమ్మరించినట్టు రాష్ట్రంలో మండుతున్న ఎండలు

- ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు -
- రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 14:**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు తీవ్రంగా మండిపోతుండటంతో పగటిపూట బయటకు రావడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి.

ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 42.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 41 డిగ్రీలు, ఖమ్మంలో 40.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా పెరగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

***పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు***

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాతావరణశాఖ అధికారులు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలతో పాటు జగిత్యాల, సిరిసిల్ల, హైదరాబాద్ ప్రాంతాలకు ఈ హెచ్చరికలు వర్తిస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరించారు.

ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఉండే అవకాశముందని తెలిపారు. ఎల్లుండి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వివరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశముందని హెచ్చరించారు.

# రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు

- రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు వీఐపీల సెక్యూరిటీ విడతల వారీగా తగ్గిస్తాం: డీజీపీ శివధర్‌రెడ్డి

**ఆదిలాబాద్,ఏప్రిల్:**



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు కల్పిస్తున్న భద్రతపై పోలీస్ శాఖ పునఃసమీక్ష చేపడుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో వీఐపీల సెక్యూరిటీని విడతల వారీగా తగ్గించే యోచనలో ఉన్నామని తెలిపారు. అయితే తక్షణమే భద్రతను తగ్గించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా మారుమూల గూడెం చించుఘాట్‌లో పర్యటించిన డీజీపీకి స్థానిక ఆదివాసీలు సంప్రదాయ గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించి, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు ఎంతో గొప్పవని డీజీపీ కొనియాడారు. తమ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలని, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని యువతకు సూచించారు. సెల్‌ఫోన్ వినియోగంతో సమయం వృథా కాకుండా పుస్తకాలు చదివితే జ్ఞానం పెరుగుతుందని వివరించారు.

గ్రామాన్ని గంజాయి రహిత గూడెంగా మార్చేందుకు గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాన్ని డీజీపీకి అందజేశారు. పోలీస్ శాఖ తరపున స్థానిక యువతకు హెల్మెట్లను పంపిణీ చేసిన ఆయన, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు

- ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా?
- లక్ష్మణ్ వలసపోయారని విమర్శలా
- ఇందిర, రాహుల్, ప్రియాంక ఎక్కడి నుంచి వచ్చారు
- రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:**

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారంటూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడొద్దని, వాస్తవాలు మాట్లాడాలని, వితండవాదనలు పక్కన పెట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉప రాష్ట్రపతులుగా ఉన్నారని, వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా పనిచేశారని గుర్తు చేశారు. తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడినుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని, మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు అధికారికంగా కోశాధికారిగా పనిచేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్నిసీట్లు పెరుగుతాయనేది పార్లమెంటుసమావేశాల్లో తెలుస్తుందని చెప్పారు.

# జీవన్‌రెడ్డికి మర్యాద తగ్గించలేదు

- పరిస్థితులను పంచుకునేందుకే మీతో సమావేశం
- జగిత్యాల ముఖ్య నేతలతో రేవంత్ భేటీ
- మేమంతా కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం
- స్పష్టం చేసిన నాయకులు

**హైదరాబాద్, ఏప్రిల్ 14:**



జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం తన నివాసంలో భేటీ అయ్యారు. 20వ తేదీన జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ, కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్న సందర్భంగా ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో పరిస్థితులను పంచుకోవాలనే మీతో సమావేశమయ్యానంటూ తాము ఎప్పుడూ జీవన్ రెడ్డిని తక్కువ చేసి చూడలేదు.. ఆయన మర్యాదను తగ్గించేలా మాట్లాడలేదు.. ఆయన గౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించలేదు అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 2023 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అంతా కష్టపడ్డాం.. పార్లమెంటు ఎన్నికల్లో ఆయన్ను కరీంనగర్ నుంచి పోటీ చేయాలని సూచిస్తే నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానని కోరినా పార్టీ టికెట్ ఇచ్చిందని తెలిపారు. దురదృష్టవశాత్తు ఆయన ఓడిపోయారు.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్ రెడ్డి సూచించిన వారికే టికెట్లు ఇచ్చాం.. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చినా వినలేదు అని తెలిపారు. మొండిపట్టుతో ఆయన పార్టీ వీడారని చెప్పారు. 40 ఏండ్లు ఆయన కోసం పని చేసిన కార్యకర్తలను మోసం చేసి దుర్మార్గుడైన కేసీఆర్‌తో జతకట్టారని ఆరోపించారు. ఆయన లాంటి వ్యక్తి కేసీఆర్ దగ్గర చేతులు కట్టుకుని నిలబడటం అత్యంత బాధాకరమన్నారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని జీవన్ రెడ్డి కేసీఆర్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన వయసుకు, అనుభవానికి ఇది తగదన్నారు. ఈనాటికీ తా□ను ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఒక్క మాట మాట్లాడలేదన్నారు. కుట్రలను తిప్పికొట్టాలని మనం ప్రయత్నం చేస్తుంటే ఆయన వెళ్లి అక్కడ చేరారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే నిలబెట్టడం తప్పా.. తాను చేస్తున్నది మంచో చెడో మీరే ఆలోచించండి.. ఎవరు ఏమిటి అన్నది కాలమే నిర్ణయిస్తుంది అని అన్నారు.

**త్వరలో జగిత్యాలకు వస్తా..**

అండగా నిలబడండి.. మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొద్దాం.. ధైర్యంగా ఉండండి.. త్వరలోనే కార్యకర్తలను కలిసేందుకు జగిత్యాలకు వస్తా.. కలిసికట్టుగా జగిత్యాలను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. వ్యక్తికంటే పార్టీ ముఖ్యమని నిరూపించిన మీ అందరినీ అభినందిస్తున్నానన్నారు. కాగా, పెద్ద నాయకులు పార్టీని వీడినా తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని జగిత్యాల నాయకులు స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళతామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని సీఎంకు హామీ ఇచ్చారు. ఈ భేటీకి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు నందయ్య, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# సమానహక్కులు కల్పించిన ఘనత బాబా సాహెబ్‌దే

- జయంతి సభలో బిఆరఎస్ నేత పద్మాదేవేందర్

**మెదక్, ఏప్రిల్ 14:**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆరఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆరఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం అపారమని కొనియాడారు. దేశ స్వపరిపాలనకు ఆదర్శంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి గల నాయకుడని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టడంతో పాటు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో బీఆరఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఆశయాలతో నవ సమాజ నిర్మాణానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 14:**

నాగర్ కర్నూల్ జిల్లాలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మార్గదర్శకాలను పాటించకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ, విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంగూరు మండలం పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఏ□V పంచాయతీ కార్యదర్శి పి.కిషన్, కొల్లాపూర్ మండలం పరిధిలోని సింగోటం గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఏఏఏ పంచాయతీ కార్యదర్శి పి. అర్జునయ్య, అలాగే కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఏఏఏ పంచాయతీ కార్యదర్శి ఆర్. ప్రేమచంద్‌లను విధుల నుండి సస్పెండ్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా వంగూరు, కొల్లాపూర్ మండలాల పంచాయతీ అధికారులకు షోకాస్ నోటిసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## మహిళా బిల్లు, డిలిమిటేషన్‌పై 16న చర్చ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:**

దేశంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న వీటిని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారమిస్తూ.. సంబంధిత ప్రతులను వారికి పంపింది. నూతన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రా□ల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలకు పెరిగే అవకాశముంది.

# మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

- మహిళా బిల్లులను తక్షణమే అమలు చేయాలి
- డీ లిమిటేషన్‌పై విస్తృత చర్చ జరపాలి
- ప్రధాని మోడీకి సిఎం రేవంత్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 14:**



మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుంది. తక్షణమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలి. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రోరేటా(జనాభా ప్రాతిపదికన), మిగిలిన 50శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థిక వృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయాలని రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయకూడదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ తన లేఖలో మహిళా రిజర్వేషన్లకు దేశవ్యాప్తంగా విస్తృత మద్దతు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో మహిళా కోటాను తక్షణమే అమలు చేస్తే, దేశమంతా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆందోళనలు వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేపడితే.. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ తాత్కాలికంగా కొన్ని రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా బీజేపీకి లాభం చేకూర్చవచ్చని.. కానీ దీర్ఘకాలంలో దేశానికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. లోక్‌సభ డీలిమిటేషన్ విషయంలో కేవలం జనాభా నిష్పత్తి ఆధారిత విధానాన్ని కాకుండా.. ఇతర ప్రత్యామ్నాయ నమూనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను గౌరవిస్తూ జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ తన లేఖలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోపిడీనే

- కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
- కేటీఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
- కాంగ్రెస్ కమిటీ బాధ్యతల స్వీకారంలో పీసీసీ చీఫ్

**ఖమ్మం, ఏప్రిల్ 14:**



బీఆరఎస్ నేతలు పదేళ్లపాటు దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని, ఆయన పాదయాత్ర కాదు ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్ అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఖమ్మంలో డీసీసీ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో, దోపిడీ ఎంతో చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటుపడి ప్రజల ఆగ్రహానికి గురై పదవులు కోల్పోయి నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చి మాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయ్యారని, ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యకర్తల కష్టంతో నేడు అధికారంలోకి వచ్చామని, పార్టీలో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని చెప్పారు. భట్టి విక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నికే కాదు.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని అన్నారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ తదితరులు హాజరయ్యారు.





సంపాదకీయం

# యుద్ధోన్మాద మత్తు దిగితేనే ప్రపంచ శాంతి!

నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్..యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేసింది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా...అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్దరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభంముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. హార్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. హార్మూజ్‌లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు .కూడా ము÷ఎద్ధం ముగిస్తే తప్ప చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.

# వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు

- చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం
- దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోడీ వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల ప్రక్రియ మొదలుపెట్టాం. పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపెడతాం. దీనిపై ఏమాత్రం ఆలస్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసినట్టే. 2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి‘ అని మోదీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో నారీ శక్తి వందనం అధినియమ్’ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.

# నోయిడా అల్లర్ల వెనుక పాక్ కుట్ర?

- 300 మంది కార్మికుల అరెస్టు..
- వేతనాల పెంపుతో యూపీ సర్కార్ దిద్దుబాటు చర్యలు



**లక్నో, ఏప్రిల్14:** నోయిడా పారిశ్రామిక ప్రాంతంలో వేతనాల పెంపు కోరుతూ కార్మికులు చేపట్టిన నిరసనలు ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చడం వెనుక దేశ వ్యతిరేక శక్తుల ప్రమేయం ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ అల్లర్ల వెనుక పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల హస్తం ఉండవచ్చని ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ విధ్వంసం జరిగిందని, రాష్ట్రంలో అస్థిరత సృష్టించేందుకు విదేశీ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇటీవల నోయిడా, మీరట్‌లలో పాక్ ఉగ్రవాదులతో సంబంధాలున్న నలుగురు అనుమానితులు అరెస్టయిన నేపథ్యంలో, తాజా అల్లర్లను కూడా అదే కోణంలో దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా ముజఫర్‌నగర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యటనకు అంతరాయం కలిగించే కుట్రలో భాగంగానే ఈ అలజడి సృష్టించి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా విధ్వంసానికి పాల్పడిన 300 మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, మరో వంద మందిని విచారిస్తున్నారు. మరోవైపు ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కార్మికులకు భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల కనీస వేతనాలను మూడు వేల రూపాయల వరకు పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. దీని ప్రకారం నోయిడా, ఘజియాబాద్ ప్రాంతాల్లోని నైపుణ్యం లేని కార్మికుల నెలవారీ వేతనం 11,313 రూపాయల నుండి 13,690 రూపాయలకు పెరిగింది. పెంచిన ఈ వేతనాలు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే మంగళవారం కూడా నోయిడాలో కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణలు కొనసాగాయి. తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కార్మికులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. కార్మికుల సమస్యలను వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎవరూ రెచ్చగొట్టే చర్యలకు ప్రభావితం కావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్నతాధికారుల బృందం నోయిడాలో ఉండి కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరుపుతోంది.

# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

- కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక
- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్





**పాట్నా, ఏప్రిల్ 14:** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్లు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్లు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

# 850కి చేరనున్న లోక్‌సభ స్థానాలు

- పునర్విభజన బిల్లుకు రంగం సిద్ధం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను ఏకంగా 850కి పెంచేందుకు రంగం సిద్ధం చేస్తూ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులను ఈ నెల 16న పార్లమెంటులో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదన ప్రకారం వివిధ రాష్ట్రాల లోక్‌సభ సీట్లను 815కు, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్లను 35కు పెంచబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై గత రెండు వారాలుగా రాజకీయ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు సాగుతుండగా, తాజాగా కేంద్రం ఈ ముసాయిదా చట్ట ప్రతులను ఎంపీలకు పంపి కీలక సమాచారాన్ని అందించింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ రెండు కీలక బిల్లులను ప్రవేశపెట్టి ఆమోద ముద్ర వేయించుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం అధికారికంగా డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసి సీట్ల పెంపు ప్రక్రియను పూర్తి చేయనుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా 850 ఎంపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. అన్ని రాష్ట్రాలకు సగటున లోక్‌సభ మరియు అసెంబ్లీ సీట్లను 50 శాతం మేర పెంచడం ద్వారా ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రాతినిధ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముసాయిదా ప్రతులు అందుకున్న ఎంపీలు ఈ చారిత్రాత్మక మార్పుపై ఇప్పటికే లోతుగా అధ్యయనం చేస్తున్నారు.



# కూసుమంచిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** విశ్వమానవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కూసుమంచి సర్పంచ్,ఉప సర్పంచ్ కొండా క్రిష్ణవేణి, చెన్ను వెంకటరమణ అన్నారు.మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమం పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వార్డు సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి,అంతోటి వెంకన్న, చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి ఉపేందర్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా కీర్తించబడుతున్న అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలకపాత్ర పోషించారని తెలిపారు.నేడు మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నారంటే అంబేద్కర్ చలువేనన్నారు.అంబేద్కర్ ఏ ఒక్క జాతికి, ఏ వర్గానికి పరిమితమైన వ్యక్తి కాదని, దేశంలోని అన్నివర్గాలకు ఆరాధ్యుడన్నారు.ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశానికి దిక్సూచి అని ఆయన సేవలు చిరస్మరణీమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మంద చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**రామారెడ్డి రాజము ద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రంతో పాటు ఉప్పల్వాయి, మోషం పూర్, గిద్ద, పోసానిపేట్ అన్ని గ్రామాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు, అనంతరం ఉప్పల్ వాయి గ్రామ సర్పంచ్ శివరాణి రాజేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శమని అన్నారు, సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాముఖ్యతపై అంబేద్కర్ చూపిన దారిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం ప్రతి పౌరుడు బాధ్యత అని, బలహీన వర్గాల అభివృద్ధి ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు, ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, యువకులు మహిళలు తదితరులు పాల్గొని జయంతి వేడుకలను జయప్రదం చేశారు.

# గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ను కలిసిన పాలకవర్గం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామ సర్పంచ్ మోహన్ నాయక్, స్థానిక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధి కోసం, గ్రామంలో ఉన్న సమస్యల కోసం ముఖ్యంగా ప్రహరీ గోడ, బోరు మోటర్, వడ్ల కొనుగోలు కేంద్రానికి స్థలాన్ని మంజూరు చేయాలని గ్రామపంచాయతీ లెటర్ ప్యాడ్ పై రాసి అందజేశారు, వీటికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు . ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కాలభైరవ స్వామి కి సింధూర పూజలు...



**రామారెడ్డి (రాజముద్ర,) న్యూస్:** రామారెడ్డి మండలం ఈసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజున ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు , ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు పూజారులు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , భక్తులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో 15న బీఆర్ఎస్ భారీ సభ

## పాల్గొనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి

- **తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీశ్రీరామ రక్ష - జక్క వెంకట్ రెడ్డి**
- **కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపు**



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్పీర్జాదిగూడ డివిజన్ పరిధిలో ఈరోజు అనగా 15వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సరైన స్పందన చూపడంలో విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. పీర్జాదిగూడ (ఓల్డ్) పరిధిలో కూడా పెద్ద ఎత్తున జాయినింగ్స్కు స్పందన లభిస్తున్నదని వెల్లడించారు. స్థానిక స్థాయిలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ ఈ సభలో స్పష్టంగా కనిపించనుందని ఆయన అన్నారు. ఈ నెల 15న పీర్జాదిగూడలోని శ్రీ పలని కన్వెన్షన్లో జరిగే సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా చేరే నాయకులను ఆహ్వానించనున్నారని తెలిపారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మరియు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంబీపూర్ రాజు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సభను బీఆర్ఎస్ పార్టీ శక్తి ప్రదర్శనగా నిలిపేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ ప్రాంగణంలో పార్కింగ్, భద్రత, తాగునీరు, వసతులు వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేస్తున్నామని వివరించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. అధిక సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు హాజరై సభను ఘనవిజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభ ద్వారా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి దిశగా బీఆర్ఎస్ పార్టీ సంకల్పాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని పునరుద్ఘాటిస్తూ, భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని జక్క వెంకట్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ ఆశయాలను అచరణలో అమలు చేయాలి ఎస్సై పి. సంతోష్

## నేలకొండపల్లి లో ఘనంగా 135 వ అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ సాధకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను దళిత సంఘాల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, యూనిటీ ఆఫ్ మాల, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీల మండల నాయకులు, సామాజిక ఉద్యమ కారులు, బీసీ సంఘాల నాయకులు, యువత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎస్సై పీ. సంతోష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను అచరణ లో అమలు చేయాలని అయన విధనాన్ని స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతకు ఆయన జీవితం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలోఅసమానతలు తొలగించడానికి అంబేద్కర్ చూపిన మార్గం అయన అశయాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్య, చట్టం ద్వారా సాధికారత సాధించాలన్న ఆయన సందేశం నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ నాయకులు వంగూరి ఆనందరావు, పగిడి కత్తుల ఈదయ్య, మాదాసు వెంకన్న, తొల్ల సురేష్, మాదాసు ఆదాం, తొల్ల వెంకన్న, మాల మహానాడు నాయకులు బట్టపోతుల ప్రకాశం, యూనిటీ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి అవుట మధు, సీనియర్ జర్నలిస్ట్ v6 కర్ణ,అంబేద్కరిస్ట్ సలవాధి వెంకట రత్నం, సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కే.వి రెడ్డి, ఏటుకూరి రామారావు, బీ ఆర్ ఎస్ నాయకులు కాసాని నాగేశ్వ రావు, యువత తదితరులు పాల్గొన్నారు.




# అంబేద్కర్ ఆశయాల దిశగా ముందుకు సాగాలి

## ఏలూరి శ్రీనివాసరావు పిలుపు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గెజిటెడ్ భవన్లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన మార్గంలో అధికారులు నడుస్తూ ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కేవలం సామాజిక సంస్కర్త మాత్రమే కాకుండా గొప్ప ఆర్థికవేత్త కూడా అని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు ఆర్థిక అవకాశాలను కూడా ప్రభావితం చేస్తాయని ఆయన విశ్లేషణలు నేటికీ ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు. భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఆయన చేసిన పరిశోధనలు కీలకమై, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపనకు పునాదులు వేసినట్లు చెప్పారు. కార్మికులకు 8 గంటల పని విధానం, మహిళలకు ప్రసూతి సెలవులు, కనీస వేతనం వంటి హక్కులు కల్పించడంలో అంబేద్కర్ పాత్ర గొప్పదని కొనియాడారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే నినాదంతో కోట్లాది మందిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన అన్నారు. ఆయన కలల సమసమాజాన్ని సాధించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి అధ్యక్షత వహించగా, వివిధ విభాగాల గెజిటెడ్ అధికారులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి

## అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం






**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కూసుమంచి మండలంలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామ పంచాయతీ ఆదాయం భారీగా దెబ్బతింటోందని బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి ఆరోపించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాల్సిన గ్రామ పంచాయతీ షాపుల వేలంపాటలను నిర్వహించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. మార్చి 31లోపు వేలంపాట పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తికాకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి 15 రోజులు గడిచినా షాపులను స్వాధీనం చేసుకోకపోవడం, అద్దె నిర్ణయం తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది అని తెలిపారు. కొన్ని షాపుల విషయంలో విచిత్ర ధోరణి అవలంబిస్తూ, సరైన విధానాలు పాటించకుండా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది అద్దెలను ప్రామాణికంగా తీసుకోకుండా, స్లాబ్ విధానం లేకుండా కేవలం నామమాత్రంగా కేటాయించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, షాపులను స్వాధీనం చేసుకుని పారదర్శకంగా వేలంపాట నిర్వహించి గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# కొండంత పని చేస్తున్నాం.. గడప గడపకూ చెప్పండి: మంత్రి పొంగులేటి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.గత పాలకులు చిన్న పనులు చేసి పెద్దగా ప్రచారం చేసుకున్నారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నప్పటికీ ప్రజల్లోకి ఆ విషయాలను తీసుకెళ్లడంలో వెనుకబడిందని మంత్రి అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కార్యకర్తల ప్రభుత్వమే కొనసాగుతోందని పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల కోసం కష్టపడ్డ కార్యకర్తల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అదే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వారు ఇప్పుడు అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు ఆ మాటలను నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించగలిగితే కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామదాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డా. బి ఆర్ అంబేద్కర్ కు ఘనంగా నివాళులు

- ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్
- బాబాసాహెబ్ ఆశయ సాధనే మన లక్ష్యంగా ముందుకు




**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది, కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. అణచివేత, చిన్నచూపునకు గురైనా అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరూ సాధించలేని ఉన్నత చదువులు చదివి భారతదేశానికి వచ్చి, రాజ్యాంగాన్ని రచించి, అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని, నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పధంలో ఉండాలన్నారు. ఏ వర్గమైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఈ దేశంలో ప్రతి వారికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అని, ఒక వర్గం, కులానికి కాదని, అందరి కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా మేధావని కొనియాడారు.

## రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు ఘన నివాళులు: పాగర్తి సుధాకర్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నేలకొండపల్లి మండలంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో పైనంపల్లి, చెరువు మాదారం, భైరవునిపల్లి, నేల కొండపల్లి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్తగా దేశానికి అపార సేవలు అందించారని తెలిపారు. అంటరానితనం నిర్మూలన, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వతంత్ర భారతదేశపు తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన అంబేద్కర్ న్యాయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో విశేష కృషి చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన గోపి, పుట్టా సత్యనారాయణ, కొడమగుండ్ల స్వామిదాస్, తంగెళ్ల సతీష్, గెల్లా చక్రపాణి, పిట్టల సూరిబాబు, మూడు రమేష్, కారంగుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## సమానత్వానికి మార్గదర్శి అంబేద్కర్... ఘనంగా జయంతి వేడుకలు



**కామారెడ్డి,రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సోమవారం ఉదయం నుంచే జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద పూలమాలలు అర్పిస్తూ ఆయనకు నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి అపారమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు అంబేద్కర్ జీవితం, సేవలపై వ్యాసరచన, ప్రసంగ పోటీలు నిర్వహించారు. గ్రామస్థాయిలో యువకులు ర్యాలీలు చేపట్టి అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పారు. అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సంఘాలు, యువజన సంఘాలు ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించి అంబేద్కర్ సేవలను స్మరించాయి. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం సాధించాలని సంకల్పం వ్యక్తం చేశారు. జిల్లా అంతటా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు అంబేద్కర్ పట్ల ప్రజల గౌరవాన్ని మరోసారి చాటాయి.

## ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** :భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుడుగుంట్ల గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.రాజ్యాంగం కల్పించిన ఫలాలు సమాజంలోని అట్టడుగు స్థాయి వ్యక్తికి కూడా అందేలా చూడటమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మన్సూర్ బాయ్,రాజు,సత్యం,అలీ భాయ్,శ్రీను,పవన్,చిన్న శ్రీను,మనో,భవాని,కీర్తి,సతీష్,సత్తి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ను కలిసిన సర్పంచ్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్ స్థానిక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధి కోసం, గ్రామంలో ఉన్న సమస్యల కోసం ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, అదనంగా మంజూరు చేయాలని గ్రామపంచాయతీ లెటర్ ప్యాడ్ పై రాసి అందజేశారు, వీటికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, పాలకవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

### పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా డా. బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు




**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నాయకులు ఘన నివాళులు అర్పించి బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలను, దేశానికి చేసిన అపారమైన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, ఆంజనేయులు, బాలరాజు, అశోక్, మల్లం వెంకటేష్ గౌడ్, బుల్లెట్ శంకర్, వరికల శ్రీనివాస్, సోమేశ్, అక్కల శ్రీనివాస్, కిరణ్ నాయక్, శంకర్ చారి, కళ్యాని, రమేష్, జంగయ్య, శ్రీనివాస్, పన్నాభాయ్, సత్యం, సతీష్, రంజిత్ రెడ్డి తదితర పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరు జర్నలిస్టు? ఎవరికి అక్రిడేషన్?

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మీడియా రంగంలోని అసలు ప్రమాణాలు

సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు తెలియజేసే బాధ్యత గల వ్యక్తి “జర్నలిస్టు”. నిజాలను వెలికితీసి, ప్రజల ముందుకు తీసుకురావడం, అధికార వ్యవస్థపై పర్యవేక్షణ చేయడం, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలబడటం జర్నలిజం లక్ష్యం. కానీ ఈ రోజుల్లో ఎవరు నిజమైన జర్నలిస్టు? ఎవరికే అక్రిడేషన్ రావాలి? అనే ప్రశ్నలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

**జర్నలిస్టు అంటే ఎవరు?**

జర్నలిస్టు అనేది కేవలం వార్తలు రాసేవాడు కాదు.

**అతను/ఆమె:** సమాజంలోని సమస్యలను గుర్తించే వ్యక్తి వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు అందించే బాధ్యతగల వృత్తిదారి

నిష్పక్షపాతంగా పని చేసే వ్యక్తి

ప్రజల గొంతుకగా నిలిచే వక్త

జర్నలిస్టులు పత్రికలు, టీవీ చానెల్స్, డిజిటల్ మీడియా వంటి వేదికల ద్వారా వార్తలను అందిస్తారు.

**అక్రిడేషన్ అంటే ఏమిటి?**

అక్రిడేషన్ అనేది ప్రభుత్వ గుర్తింపు. ప్రభుత్వం ఒక జర్నలిస్టును అధికారికంగా గుర్తించి, అతను/ఆమె నిజమైన మీడియా ప్రతినిధి అని అంగీకరించడం.




**ఎవరికే అక్రిడేషన్ ఇవ్వాలి?**

అక్రిడేషన్ పొందడానికి కొన్ని ముఖ్యమైన అర్హతలు ఉండాలి:

గుర్తింపు పొందిన పత్రిక/చానెల్/డిజిటల్ మీడియా సంస్థలో పని చేయాలి

నిరంతరం వార్తలు కవర్ చేయాలి

కనీస అనుభవం ఉండాలి (సాధారణంగా 3–5 సంవత్సరాలు)

ప్రెస్ ఐడీ కార్డు, సంస్థ ధృవీకరణ ఉండాలి

జర్నలిజం నిబంధనలు, నైతిక విలువలు పాటించాలి.

**ఎవరికీ ఇవ్వకూడదు?**

ఈ రోజుల్లో అక్రిడేషన్ దుర్వినియోగం పెరుగుతోంది.

కాబట్టి:

కేవలం పేరు కోసం కార్డులు తీసుకునేవారికి ఇవ్వకూడదు

వార్తలతో సంబంధం లేని వ్యక్తులకు ఇవ్వకూడదు

బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడేవారికి ఇవ్వకూడదు

సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పంచేవారిని గుర్తించి నిరాకరించాలి.

**అక్రిడేషన్ ప్రాముఖ్యత**

**అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు:**

ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారిక ప్రవేశంసమాచారం సులభంగా పొందే అవకాశం

సమాజంలో విశ్వసనీయత

ప్రత్యేక గుర్తింపు

ప్రస్తుత పరిస్థితి

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో అక్రిడేషన్ విధానం సడలింపులతో ఉంది. దీని వల్ల:

నకిలీ జర్నలిస్టుల సంఖ్య పెరుగుతోంది

నిజమైన మీడియా ప్రతినిధుల ప్రతిష్ట దెబ్బతింటోంది

ప్రజల్లో మీడియాపై నమ్మకం తగ్గుతోంది

అవసరమైన మార్పులు

అక్రిడేషన్ ప్రక్రియను కఠినంగా అమలు చేయాలి

అర్హులైన జర్నలిస్టులకు మాత్రమే ఇవ్వాలి

ప్రతి ఏడాది సమీక్ష చేయాలి

నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి

ముగింపు

జర్నలిజం ఒక పవిత్రమైన వృత్తి. దాన్ని కాపాడుకోవడం ప్రతి జర్నలిస్టు బాధ్యత.

అక్రిడేషన్ అనేది కేవలం కార్డు కాదు —— అది బాధ్యత, నిబద్ధతకు ప్రతీక. నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు గుర్తింపు లభిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.



# సన్‌రైజర్స్ స్క్వాడ్‌లో కొత్త పేసర్

## అరంగేట్రం ఆ మ్యాచ్‌తోనేనా..!


**హైదరాబాద్ :** పంతొమ్మిదో సీజన్‌లో మళ్లీ గెలుపు తోవ తొక్కిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త బౌలర్‌ను తీసుకుంది. ఐపీఎల్‌లో అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న శ్రీలంక పేసర్ దిల్షాన్ మధుషనకతో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఒప్పందం కుదుర్చుకుంది. గాయంతో బాధ పడుతున్న బ్రాండన్ కార్సేస్థానంలో లంక స్పీడ్‌స్టర్ ఆరెంజ్ ఆర్మీ స్క్వాడ్‌లో చేరనున్నాడు. ఈ విషయాన్ని మంగళవారం ఎస్‌ఆర్‌హెచ్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ప్యాట్ కమిన్స్ సేవల్ని కోల్పోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ దళాన్ని పటిష్టం చేసుకుంటోంది. ఆరంభ పోరుకు సిద్ధమవుతూ గాయపడిన బ్రాండన్ కార్సే స్థానంలో దిల్షాన్ మధుషనకను తీసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ కోసమని నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేస్తుండగా కార్సే చేతికి గాయమైంది. దాంతో, అతడు అప్పటి నుంచి జట్టుకు దూరంగా ఉంటున్నాడు.

# కీపింగ్‌కు ఇషాన్ కిషన్ 'గుడ్ బై'!

## సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఉన్నంత కాలం గ్లౌవ్స్ ధరించను

## ఇషాన్ సంచలన నిర్ణయం

**ఢిల్లీ:** సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ ఒక కీలకమైన నిర్ణయాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇకపై తాను జట్టు తరఫున వికెట్ కీపింగ్ బాధ్యతలను నిర్వహించబోనని, కేవలం ఫీల్డర్‌గా మరియు కెప్టెన్‌గా మాత్రమే కొనసాగుతానని స్పష్టం చేశారు. వికెట్ల వెనుక ఉండి జట్టును నడిపించడం కంటే, ఫీల్డ్‌లో ఉండి బౌలర్లతో నేరుగా సంభాషించడం మరియు ప్రణాళికలు చర్చించడం జట్టుకు మేలు చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. కీపింగ్ చేస్తున్న సమయంలో బౌలర్లతో కమ్యూనికేషన్‌లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే కెప్టెన్సీ బాధ్యతలు ఉన్నంత కాలం కీపింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా ఐపీఎల్ 2026 సీజన్‌కు దూరం కావడంతో ఇషాన్ ఈ సారథ్య బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం ఉప్పల్ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో సన్‌రైజర్స్ ఘనవిజయం సాధించింది. ఈ విజయం అనంతరం ఇషాన్ కిషన్ మాట్లాడుతూ జట్టు బౌలర్ల ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురిపించారు. బౌలర్లు తమ ప్రణాళికలను మైదానంలో అద్భుతంగా అమలు చేశారని, ఈ విజయం క్రెడిట్ అంతా వారికే దక్కుతుందని కొనియాడారు. ముఖ్యంగా యువ బౌలర్లు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, బౌలింగ్ కోచ్ వరుణ్ అరుణ్ నేతృత్వంలో వారు చేసిన కఠిన శ్రమకు తగిన ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. హోమ్ గ్రౌండ్‌లో యువకులకు అవకాశం ఇవ్వాలన్న తమ నిర్ణయం సరైనదని ఈ విజయంతో నిరూపితమైందని ఆయన అన్నారు. జట్టు బ్యాటింగ్ విభాగంపై కూడా ఇషాన్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రతి మ్యాచ్‌లోనూ 200కు పైగా పరుగులు సాధిస్తున్నామని, బ్యాటర్లు అందరూ మంచి ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశమని పేర్కొన్నారు. ఓపెనర్ అభిషేక్ శర్మ దూకుడు ఆట శైలి గురించి ప్రస్తావిస్తూ, అతడు త్వరగా ఔట్ అయినా సరే తన సహజ సిద్ధమైన ఆటను ఆడేందుకు పూర్తి స్వేచ్ఛనిస్తామని చెప్పారు. అభిషేక్ ఒక్కసారి కుదురుకుంటే జట్టు స్కోరు సులువుగా 260 మార్కును దాటుతుందని, అందుకే అతనిపై ఎలాంటి ఒత్తిడి పెట్టదలచుకోలేదని ఇషాన్ వివరించారు. ఈ విజయంతో సన్‌రైజర్స్ ఖాతాలో మరో రెండు పాయింట్లు చేరడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



# చెలరేగిన చెన్నై

## కోల్‌కతా నైట్ రైడర్స్ చిత్తు

- 32 పరుగుల తేడాతో సూపర్ కింగ్స్ ఘన విజయం
- చెలరేగిన శాంసన్, బ్రెవిస్, ఆయుష్
- స్పిన్ మాయాజాలంతో దెబ్బకొట్టిన నూర్ అహ్మద్





**చెన్నై, ఏప్రిల్ 14:** సొంత గడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ సత్తా చాటింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో భాగంగా చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియంలో మంగళవారం జరిగిన 22వ మ్యాచ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన చెన్నై.. కోల్‌కతాపై 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన కోల్‌కతా ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో తడబడిన కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

### ఆరంభం నుంచే దూకుడు..

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టుకు భారీ స్కోరు అందించారు. సంజు శాంసన్ 32 బంతుల్లో 48 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. డెవాల్డ్ బ్రెవిస్ 29 బంతుల్లో 41 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో ఆయుష్ మ్హాత్రే కేవలం 17 బంతుల్లోనే 38 పరుగులతో చెలరేగిపోవడంతో చెన్నై భారీ స్కోరు సాధించగలిగింది. కోల్‌కతా బౌలర్లలో కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అనుకుల్ రాయ్ 3 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి ఒక వికెట్, సునీల్ నరైన్ 4 ఓవర్లలో 21 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు. మిగతా బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

### నూర్ అహ్మద్ స్పిన్ మాయ..

193 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. చెన్నై బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు కోల్‌కతా బ్యాటర్లు చేతులెత్తేశారు. ముఖ్యంగా చెన్నై స్పిన్నర్ నూర్ అహ్మద్ తన స్పిన్ మాయాజాలంతో కోల్‌కతా బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీశాడు. 4 ఓవర్లు వేసిన నూర్ కేవలం 21 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కాంబోజ్ 4 ఓవర్లలో 32 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి తన వంతు సహకారం అందించాడు. ఖలీల్ అహ్మద్ ఒక వికెట్ తో రాణించాడు.

### పోరాడి ఓడిన కోల్‌కతా..

కోల్‌కతా ఇన్నింగ్స్ లో రమణ్‌దీప్ సింగ్ 23 బంతుల్లో 35 పరుగులు చేసి అత్యధిక స్కోరర్ గా నిలిచాడు. రోవ్‌మన్ పావెల్ 22 బంతుల్లో 31 పరుగులతో అజేయంగా నిలిచాడు. అజింక్యా రహానే 22 బంతుల్లో 28 పరుగులు చేశాడు. అవసరమైన రన్ రేట్ భారీగా పెరిగిపోవడం, క్రీజులో పాతుకుపోయి ఆడే బ్యాటర్లు లేకపోవడంతో కోల్‌కతా ఓటమి ఖాయమైంది. చివర్లో హిట్టర్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సొంత మైదానంలో ప్రేక్షకుల మద్దతుతో చెన్నై ఆటగాళ్లు ఉత్సాహంగా ఆడి అద్భుత విజయాన్ని తమ ఖాతాలో వేసుకున్నారు. పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు.



# వైభవ్ బ్యాటింగ్ శైలిపై ఇర్ఫాన్ పఠాన్ 'థియరీ'!

## వైభవ్ సూర్యవంశీ యువ సంచలనం.. అతడిని వెంటనే టీమిండియాలోకి తీసుకోవాలి: ఇర్ఫాన్

**ఢిల్లీ:** ప్రస్తుత క్రికెట్ సీజన్‌లో తన మెరుపు బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రపంచ స్థాయి బౌలర్లైన జస్ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, దీపక్ చాహర్ వంటి దిగ్గజాలను అలవోకగా ఎదుర్కొని ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించిన వైభవ్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అనూహ్యంగా డకౌట్ అయ్యాడు. పెద్దగా అనుభవం లేని అన్‌క్యాప్డ్ ప్లేయర్ ప్రఫుల్ హింగే వేసిన తొలి బంతికే పెవిలియన్ చేరడంతో వైభవ్ బ్యాటింగ్ శైలిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో తాను చేసిన వ్యాఖ్యలను ఇర్ఫాన్ పఠాన్ గుర్తు చేస్తూ, తన 'థియరీ' నిజమేనని పునరుద్ఘాటించారు. "ఈ కుర్రాడు కావాలనే పెద్ద బౌలర్లను టార్గెట్ చేస్తున్నాడా?" అని గతంలో ఇర్ఫాన్ వ్యక్తపరిచిన అనుమానం ఇప్పుడు నిజమవుతున్నట్లు కనిపిస్తోంది. పెద్ద బౌలర్లను బౌండరీలకు తరలించి, తక్కువ అనుభవం ఉన్న బౌలర్ల వద్ద విఫలం కావడం పఠాన్ సిద్ధాంతానికి బలం చేకూర్చింది. అయితే అభిమానులు మాత్రం వైభవ్ ఎప్పుడూ వేగంగా పరుగులు సాధించాలనే లక్ష్యంతోనే ఆడతాడని, బౌలర్ ఎవరనేది అతడికి ముఖ్యం కాదని వాదిస్తున్నారు. ఈ వివాదం పక్కన పెడితే, వైభవ్ అసాధారణ ప్రతిభను గుర్తించిన ఇర్ఫాన్ పఠాన్.. అతడిని వెంటనే జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని బీసీసీఐకి నివేదించారు. వైట్ బాల్ క్రికెట్‌లో బుమ్రా వంటి బౌలర్‌ను ఎదుర్కోవడం చాలా కష్టమని, అలాంటిది 15 ఏళ్ల వయసులోనే వైభవ్ ఆ ఘనత సాధించడం అద్భుతమని కొనియాడారు. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఆస్తిగా మారుతాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలోనే బుమ్రా బౌలింగ్‌లో ఎక్కువ స్కోర్ చేస్తానని సవాల్ విసిరిన వైభవ్, చెప్పినట్లుగానే చేసి చూపించి తన సత్తా చాటాడు. ఒకవేళ ఇప్పుడే అతడిని టీమిండియాలోకి తీసుకుంటే మరో 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించే అవకాశం ఉంటుందని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డారు. పఠాన్ చేసిన ఈ ట్వీట్లు మరియు విశ్లేషణలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండటంతో, సెలెక్టర్లు ఈ కుర్రాడి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకుంది.











## ఫెస్టివ్ మూడ్‌లో ఐశ్వర్య మేనన్

నటి ఐశ్వర్య మేనన్ తాజా ఫోటోషూట్‌తో మరోసారి అభిమానుల మనసు దోచుకుంది. సంప్రదాయపు అందం, ఆధునిక శైలి కలిసిన ఈ లుక్‌లో ఆమె ఎంతో ఆకర్షణీయంగా మెరిసింది. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ఫోటోలు చూసినవారికి ప్రశాంతమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ఎథ్నిక్ దుస్తుల్లో ఐశ్వర్య ఎంతో సొగసుగా కనిపించింది. సహజ కాంతి, ఎర్తీ టోన్స్‌తో కూడిన ఈ సెటప్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచింది. సింపుల్ బ్యాక్‌డ్రాప్ మధ్యలో పుస్తకాన్ని పట్టుకుని చిరునవ్వుతో కనిపించిన ఆమె, శాంతి, సానుకూలత, కొత్త ఆరంభాల భావాన్ని చక్కగా వ్యక్తపరిచింది. ఈ ఫోటోషూట్‌లో ఆమె చూపించిన హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాదాసీదా లుక్‌లోనే క్లాస్‌ను చూపిస్తూ, సహజమైన అందంతో ఐశ్వర్య ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె ఎక్స్‌ప్రెషన్స్, సౌమ్యమైన ప్రెజెన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి

## జురాసిక్ పార్క్ మూవీని వదులుకున్న శ్రీదేవి

హాలీవుడ్ సినిమాల్లో అవకాశమొస్తే ఎవరైనా వదులుకుంటారా? డబ్బుకు డబ్బు.. కావాల్సినంత ప్రచారం రెండూ ఒకేసారి వచ్చి పడతాయి. అందులోనూ స్టీవెన్ స్పీల్‌బర్గ్ మూవీ అంటే కథేంటో కూడా అడగకుండా ఒప్పుకొంటారు. కానీ, అలనాటి నటి శ్రీదేవి మాత్రం నో చెప్పారట. 1993లో విడుదలైన 'జురాసిక్ పార్క్' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల వసూళ్లను రాబట్టింది. అలాంటి చిత్రంలో నటించే అవకాశాన్ని శ్రీదేవి కాదనుకున్నారు. అందుకు గల కారణాన్ని ఆమె ఓ సందర్భంలో పంచుకున్నారు. మీరెందుకు 'జురాసిక్ పార్క్' చేయడానికి నిరాకరించారు అని అడగ్గా, 'ఆ రోజుల్లో హాలీవుడ్ సినిమాలంటే ఏలియన్‌లా చేయడమే. కానీ, ఇప్పుడు అదొక గౌరవం. అందుకే ఒప్పుకోలేదు' అని శ్రీదేవి సమాధానం ఇచ్చారు. కేవలం 'జురాసిక్ పార్క్' మాత్రమే కాదు, శ్రీదేవి కెరీర్ టాప్‌లో ఉండగా, వివిధ కారణాల వల్ల చాలా పాత్రలు వదులుకున్నారు. అందులో 'డర్' కూడా ఉంది. 'చాందినీ, లమ్హే తర్వాత డర్‌లో నా పాత్ర చాలా సాధారణంగా ఉంటుందని భావించా. ఒకవేళ షారుఖ్‌ఖాన్ పోషించిన పాత్రలాంటిదైతే చేసేదాన్నేమో.ఆ క్యారెక్టరైజేషన్ నాకు బాగా నచ్చింది. ఇక జుహీచావ్లాకు అలాంటి పాత్ర కొత్తది. ఆమె సరిగ్గా సరిపోయారు' అని శ్రీదేవి చెప్పుకొచ్చారు. 2018, ఫిబ్రవరి 24న శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే.

## హై జవానీతో ఇష్క్ హోనా హై ఫస్ట్ లుక్ విడుదల



బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ బాలీవుడ్ చిత్రం హై జవానీతో ఇష్క్ హోనా హై. ఈసినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ఫస్ట్ లుక్ చూస్తుంటే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని తెలుస్తుంది. లెజెండరీ దర్శకుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 46వ చిత్రమిది. ఆయన తన కుమారుడు వరుణ్ ధావన్‌తో కలిసి మ-రోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. టిప్స్ ఫిలిమ్స్ అధినేత రమేష్ తౌరానీ, మాక్సిమిలియన్ ఫిలిమ్స్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## పాలరాతి శిల్పంలా మెరిసిన జాన్వీ కపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తాజా ఫోటోషూట్‌లో తన అందంతో మ-రోసారి అందరినీ ఆకట్టుకుంది. సింపుల్ అయినప్పటికీ క్లాసీ లుక్‌లో ఆమె కనిపించిన తీరు చూస్తే నిజంగానే పాలరాతి శిల్పంలా మెరిసిపోతుంది. వైట్ కలర్ అవుట్‌ఫిట్‌లో జాన్వీ ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. బ్యాక్ ఓపెన్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రెస్సు ఆమె గ్లామర్‌ను సున్నితంగా హైలైట్ చేసింది. సాఫ్ట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన లూజ్ స్లీవ్స్ ఆమె లుక్‌కు ఒక ఫ్లోయింగ్ ఎఫెక్ట్‌ను తీసుకొచ్చాయి. లైట్ మేకప్, నేచురల్ హెయిర్ స్టైల్ ఆమె అందాన్ని మరింత నిగారింపజేశాయి. కెమెరా వైపు వెనక్కి తిరిగి చూసే పోజ్‌లో జాన్వీ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె చూపుల్లో కనిపించిన కాన్ఫిడెన్స్, సౌమ్యత కలిసి ఈ ఫోటోను మరింత ప్రత్యేకంగా మార్చాయి. సింపుల్ బ్యాక్‌గ్రౌండ్‌లో తీసిన ఈ చిత్రం మొత్తం ఫోకస్‌ను ఆమెపైనే నిలిపింది. ఈ ఫోటోషూట్‌లో జాన్వీ మరోసారి తన స్టైల్, గ్లామర్‌ను సున్నితంగా ప్రెజెంట్ చేస్తూ, ట్రెండింగ్‌లో నిలిచింది.

## లెనిన్స్ నుంచి రేపు సాంగ్ విడుదల

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్‌ను ఏప్రిల్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, వంశీ ఐరటనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




## కొంటె చూపులతో కవ్విస్తున్న శృతి చౌహాన్

మోడల్, నటి శృతి చౌహాన్ తాజా ఫోటోషూట్‌తో మరోసారి నెటిజన్ల దృష్టిని తనవైపు తిప్పుకుంది. అందం, స్టైల్ కలిసిన ఈ చిత్రాలు చూడగానే రొమాంటిక్ భావాలను రేకెత్తించేలా ఉన్నాయి. జేడ్ స్టే ఇండియా అందమైన సహజ వాతావరణం ఈ ఫోటోలకు మరింత ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది. పీచ్ రంగు ఫ్లోరల్ దుస్తుల్లో శృతి ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. డ్రెస్‌లోని రఫిల్స్, మెరూన్ బోస్ కలిసి ఆమె లుక్‌ను మరింత హైలైట్ చేశాయి. ఎర్ర గులాబీల బొకేతో సూర్యరశ్మిలో పోజులు ఇచ్చిన ఆమె, సహజంగా వదిలిన వేవీ హెయిర్‌తో మరింత అందాన్ని చాటుకుంది. ఆమె చర్మంపై పడిన సాఫ్ట్ లైట్ మొత్తం ఫోటోషూట్‌కు మృదువైన రొమాంటిక్ టచ్‌ను అందించింది. ఈ ఫోటోషూట్‌లో శృతి వ్యక్తీకరించిన భావాలు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. సొగసుతో పాటు సున్నితమైన అమాయకత్వాన్ని మిళితం చేస్తూ ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఆమె చూపులు, హావభావాలు స్పష్టంగా మెరిసిపోతున్నాయి.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com